క్లుప్తంగా

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

మడికొండ: కొద్ది రోజులుగా హనుమకొండ, వరంగల్ పరిసర ప్రాంతాల్లో అంతర్‌రాష్ట్ర దొంగలు చాలా ఇళ్లలో దొంగతనం చేస్తున్నట్లు సమాచారం. ఇంట్లో మనుషులు ఉన్న వాళ్లను కొట్టి బంగారం, నగదు దోచుకుంటున్నారు. ఊరికి చివరిగా ఒంటరిగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని మడికొండ సీఐ కిషన్ తెలిపారు. ఆదివారం రాత్రి అమ్మవారిపేట వద్ద లారీ డ్రైవర్‌ను కొట్టి మొబైల్ లాక్కున్నారని, మన చుట్టుపక్కల వచ్చే ప్రమాదం ఉందన్నారు. మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు 8712685123, 8712685009, 8712685248కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

డీజే, సినిమా పాటలు నిషేధించాలి



రామన్నపేట : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే అమ్మవారి మండపాల వద్ద డీజే, సినిమా పాటలు నిషేధించేలా చర్యలు తీసుకోవాలని భారతీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కోట శివరామకృష్ణ కోరారు. ఈ మేరకు పరిషత్ వరంగల్ జిల్లా నాయకులతో కలిసి ఏఎస్పీ శుభమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజే, సినిమా, అశ్లీల పాటలు పెట్టే నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని కోరారు.వినతిపత్రం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డికేష్ వర్మ, సభ్యులు రమేష్, సునీల్, తదితరులు ఉన్నానరు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

కాజీపేట : పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ రావుల సదానందం (70) సోమవారం ఆకస్మికంగా మృతి చెందాడు. మాజీ మంత్రి తిరునగిరి హయగ్రీవాచారి శిష్యుడిగా కాంగ్రెస్‌లోకి వచ్చిన సదానందం రాజకీయాల్లో వెనుదిరిగి చూడలేదు. కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేయడంతో కార్పొరేటర్‌గా గెలిచి పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర అయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, సుంచు అశోక్ నివాళులర్పించారు.

జోసెఫ్‌కు నివాళి

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ యూనిట్ కార్యాలయంలో ఆఫీస్ అటెండెంట్‌గా పని చేస్తున్న జోసెఫ్ (74) అనారోగ్యంతో మృతి చెందినట్లు సోమవారం కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ అన్ని బ్రాంచీల కోఆర్డినేటర్ నాయిని సదానందం తెలిపారు. కేరళకు చెందిన జోసెఫ్ 40 ఏళ్ల నుంచి మజ్దూర్ యనియన్ ఆఫీస్ అటెండెంట్‌గా పని చేస్తున్నాడు. యూనియన్ మాజీ డివిజన్ ప్రెసిడెంట్ కె.యాదవరెడ్డి, రైల్వే సీసీఎస్ డైరెక్టర్, జనరల్ బ్రాంచీ సెక్రటరీ డాక్టర్ డి.శ్రీనివాస్‌యాదవ్, ఇంజనీరింగ్ బ్రాంచీ సెక్రటరీ ఇ.రాజేందర్, రైల్వే రిటైర్డ్ నాయకులు జోసెఫ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చంద్రమౌళికి అవార్డు



విద్యారణ్యపురి/హన్మకొండ అర్బన్: న్యూఢిల్లీలోని ఫ్రెండ్‌షిప్ ఫోరం సంస్థ హనుమకొండలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళికి ప్రతిష్టాత్మకమైన రాష్ట్రీయ ఉద్యోగి రతన్ అవార్డును (2025) ప్రదానం చేసింది. దేశవాప్తంగా వివిధ రంగాల్లో, ఉత్తమ సేవలను అందిస్తున్న వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తుంది. విద్యా రంగం అకాడమిక్ పరంగా చంద్రమౌళి అందిస్తున్న సేవలకు, ఆ కళాశాలను ఉన్నతంగా తీర్చిదిద్దటంలో చేస్తున్న కృషికి రాష్ట్రీయ ఉద్యోగి రతన్ అవార్డును ప్రదానం చేసింది. సోమవారం కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి సురేష్‌బాబు, ఎం.అరుణ అభినందించారు.

రావణాసురుడి ప్రతిమలు దహనం చేయొద్దు

విద్యారణ్యపురి : దసరాను పురస్కరించుకొని రావణాసురుడి ప్రతిమలు దహనం చేయడాన్ని నిషేధించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, ఇతర బాధ్యులు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో డీ ఆర్‌ఓ గణేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. మనోహర్ మాట్లాడుతూ రావణాసురుడు రాక్షసుడు కాదని లంక అనే రాజ్యానికి ఒక రాజు అని ఆయన తెలిపారు. ఆయన గొప్ప పరిపాలనాదక్షుడన్నారు. మన మూలవాసుల చరి త్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అంధకారంలో వందఫీట్ల రోడ్డు

- రోడ్లపై పశువుల సంచారం
- నెలరోజుల్లో ముగ్గురి మృతి

హసన్‌పర్తి : కేయూసీ–వడ్డెపల్లి ప్రధాన రహదారి చీకటిని తలపిస్తోంది. ఈ ప్రాంతంలో కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు కానీ విద్యుత్ దీపాలు అమర్చడం మరిచారు. మరికొన్ని చోట్ల స్తంభాలు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళ ఈ ఏరియాలో చీకటి కమ్ముకోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

రోడ్లపైనే పశువుల సంచారం

ఈ ప్రాంతంలోని పలు ఏరియాల్లో పశువుల సంచారం అధికమైంది. తులసీబార్ ప్రాంతంలో అసలు వీధీ దీపాలు లేవు. అసలు ఇక్కడ స్తంభాలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ ప్రాంతంలో చీకటిగా మారింది. రాత్రి వేళల్లో రహదారి కనబడకపోవడంతో ప్రమాదాలు జరిగి ఆస్పత్రిలో చేరుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. నెలరోజుల్లో ముగ్గురు వ్యక్తులు పశువులను ఢీకొని మృతి చెందినట్లు స్థానకులు తెలిపారు.

బార్‌ను మరో ప్రాంతానికి మార్చాలి

ప్రధాన సమస్య ఏమిటంటే ఇక్కడ బార్ ఉండడమేనని స్థానికులు చెబుతున్నారు. బార్‌కు వచ్చే మద్యం ప్రియులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ప్రమాదాలకు దారి తీస్తోందన్నారు. ఉదయం వేళల్లో కూడా ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని



వంద ఫీట్ల రోడ్డు

స్థానికులు వాపోతున్నారు.

కలెక్టర్, కమిషనర్, ఎమ్మెల్యేలకు ఫిర్యాదు

వంద ఫీట్ల రోడ్డుకు ఆనుకుని ఉన్న తులసీ బార్‌ను మరో చోటికి మార్చాలని స్థానికులు కోరారు. ఈ మేరకు ఇటీవల జిల్లా కలెక్టర్ స్నేహా శబరీస్, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజులను కలిసి వినతిపత్రం అందజేశారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేదని స్థానికులు పేర్కొన్నారు.



ఏర్పాటు చేయని వీధి లైట్లు

నిబంధనలకు విరుద్ధంగా బార్



వంద ఫీట్ల రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా బార్ నిర్వహిస్తున్నారు. పార్కింగ్ స్థలం లేదు. రోడ్డుపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో పశువులు సంచరిస్తున్నాయి.

– టి. దశరథం, ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



వంద ఫీట్ల రోడ్డు వెంట వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. రాత్రివేళలో వాహనంపై రోడ్డెక్కాలంటే భయమేస్తుంది. కార్పొరేషన్ అధికారులకు ఫోన్ చేసినా స్పందన మాత్రం లేదు.

– మీసాల రమేశ్, వివేక్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి

రేపటి నుంచి కుల నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమాలు

- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి

హన్మకొండ : కుల నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమాలు ఈ నెల 24 నుంచి 30 వరకు విస్తృతంగా నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలపార్కులో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) వరంగల్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రవి మాట్లాడుతూ సామాజిక విప్లవకారుడు, మహాత్మ జ్యోతిబాపూలే దేశంలో కుల నిర్మూలన ధ్యేయంగా స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 24 నుంచి 30 వరకు కుల నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమాల్లో భాగంగా గ్రామ గ్రామాన సదస్సులు, సభలు, సమావేశాలు, సహపంక్తి భోజనాలు విస్తృతంగా నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో సీపీఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ వరంగల్ డివిజన్ కార్యదర్శి బొట్ల రాకేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, అర్షం అశోక్, ల్యాదల్ల ఎల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

సంక్షిప్త సమాచారం

సమన్వయంతో పనిచేయాలి

న్యూశాయంపేట : ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పండుగలు శాంతియుతంగా జరుపుకునేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధ్యక్షతన పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల పరిధి గ్రామాల్లో సద్దుల బతుకమ్మ, దసరా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీఓ కల్పన, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, పాల్గొన్నారు.

హసన్‌పర్తి : బతుకమ్మ, దసరా పండుగల విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. హసన్‌పర్తి సంస్కృతీ విహార్‌లో హసన్‌పర్తి, ఐనవోలు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో సద్దుల బతుకమ్మ, దసరా పండుల ఏ ర్పాట్లపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీడీఓలు రవి, ఎంపీఓ కర్నాకర్‌రెడ్డి, రఘుపతి, పాల్గొన్నారు.

అభినందనలు

ఎంజీఎం: కడిపికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మాటేటి దీక్ష.. బిహార్‌లో నిర్వహించిన రీజనల్ స్థాయి క్విజ్ పోటీలో సత్తా చాటింది. సోమవారం బిహార్ రాష్ట్రం పాట్నాలోని బాపు టవర్‌లో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్‌ఐవీ/ఎయిడ్స్, టీబీ, మలేరియా, హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ, ఇతర ఆరోగ్య అంశాలపై రీజనల్ స్థాయి క్విజ్ కాంపిటేషన్‌లో దీక్ష మొదటి స్థానంలో నిలిచి నాగాలాండ్‌లో జరిగే జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైంది. ప్రథమ బహుమతి పొందిన దీక్షకు పాట్నా హెల్త్ ఓఎస్‌డీ నేహాసింగ్ బహుమతి అందజేశారు. డీఎంహెచ్‌ఓ ఎ.అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.మదన్మోహన్‌రావు దీక్షకు అభినందనలు తెలిపారు.

విజేతలకు బహుమతులు

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో ఆదివారంసాయంత్రం జరిగిన ఎంగిలిపూల బతుకమ్మ సంబురాల్లో శ్రీరాధేశ్యాం సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించారు. సోమవారం ఉదయం దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పాల్గొని విజేతలైన వారికి బహుమతులుగా చీరలను అందజేశారు. గంగు ఉపేంద్రశర్మ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ఉద్యమిద్దాం

కాజీపేట అర్బన్ : రాజకీయాలకతీతంగా ముదిరాజ్‌లు ఉద్యమిద్దామని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ తెలిపారు. హంటర్‌రోడ్డులోని ఆయన నివాసంలో సోమవారం మెపా (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో బండా ప్రకాశ్‌తో సమావేశమయ్యారు. ముదిరాజ్‌లు ఏ పార్టీలో ఉన్నా క్యాడర్‌గా కాకుండా లీడర్‌గా ఎదగాలని, ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. లష్కర్ సింగారం, రాజాజీ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఆయన వివరించారు.

నా ప్రాణాలు కాపాడండి

కాజీపేట అర్బన్ : నా ప్రాణాలు కాపాడండి అంటూ ఓ వృద్ధుడు న్యూశాయంపేటలోని రైల్వే ట్రాక్ ప్రక్కన ఉన్న పొలాల్లో పడిపోయి ఆర్తనాదాలు చేస్తున్న సంఘటన సోమవారం 108 సిబ్బందితో వెలుగులోకి వచ్చింది. 108 సిబ్బంది సురేందర్, బాలాజీ నాయక్‌ల కథనం ప్రకారం.. న్యూశాయంపేటలోని రైల్వే ట్రాక్ వద్ద ఉన్న పత్తి పొలాల్లో ఓ వ్యక్తి పడిపోయి ఆర్తనాదాలు పెడుతున్నాడని అటుగా వెళ్తున్న రైతులు సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో 108కు సమాచారం అందించారు. సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి చూడగా తీవ్రగాయాలతో సుమారు రెండు, మూడు రోజుల క్రితం పడిపోయి ఉండి చర్మంపై పురుగులతో దుర్వాసన వస్తుంది. క్షతగాత్రుడిని వివరాలు అడుగగా నా పేరు మనీష్ మాది మహారాష్ట్ర అని తెలిపాడు. ఉపాధి కోసం వచ్చానని ఇక్కడ ఎలా పడిపోయానో తెలియడం లేదంటు తెలిపాడు. తీవ్రగాయాలపాలైన మనీష్‌ను ఎంజీఎంకు తరలించి చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు.


కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని వ్యాయామ విద్యాకళాశాలలో పలు సమస్యలను పరిష్కరించాలని వ్యాయామ విద్యావిభాగానికి చెందిన పలువురు సోమవారం కేయూ రిజిస్ట్రార్ రామచంద్రంకు వినతిపత్రం సమర్పించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రీసెర్చ్ స్కాలర్ కుమార స్వామి మాట్లాడుతూ విద్యాకళాశాలలో విద్యాబోధనకు పేపర్ వైస్‌గా నోటిఫికేషన్ వేసి అర్హులైన వారిని నియమించాలని రిజిస్ట్రార్‌ను కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పుల్ల ప్రవీణ్‌కుమార్, గూడెం శంకర్ ఉన్నారు.

పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టాలి

న్యూశాయంపేట : వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్ నుంచి దేశాయిపేట వెళ్లే రోడ్డులో మంచినీటి పైప్‌లైన్ల లీకేజీలు వెంటనే మరమ్మతు చేసి రోడ్డులోని గుంతలను పూడ్చివేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ బషీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్‌లో ఆటో డ్రైవర్స్ ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశారు.

రైల్వే ఆస్పత్రిలో స్వచ్ఛతా హీ సేవా



కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఆస్పత్రిలో సోమవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ఆస్పత్రి ఏసీఎంఎస్ డాక్టర్ ఐ.నిరంజన్‌రావు పర్యవేక్షణలో రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ సురేశ్‌చంద్ భైరవా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే అధికారుల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా రైల్వే అధికారులు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నంబర్ ట్యాంపరింగ్.. పట్టుకుంటున్న పోలీసులు

కాజీపేట : ద్విచక్ర వాహనాల నంబర్ ప్లేట్లను ట్యాంపరింగ్ చేయడం నేరమంటూ పోలీసులు ప్రచారం చేయడంతో పాటు భారీ జరిమానాలు విధించడమే కాకుండా వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామంటూ పోలీసులు చెబుతున్నా.. వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల లిఫ్టింగ్ వాహనం నిత్యం పురవీధుల్లో తిరుగుతూ ట్యాంపరింగ్ చేసిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తోంది. ఎస్సై స్థాయి అధికారి ఈ వాహనానికి అధికారిగా కొనసాగుతున్నారు. ఈ–చలాన్ తప్పించుకోవడం కోసం చాలా మంది వాహనాల నంబర్లను ట్యాంపరింగ్ చేస్తూ ఇష్టారీతిగా పట్టణంలో రాకపోకలు సాగిస్తున్నారు. హెల్మెట్, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలతో బెంబెలెత్తిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది బైక్‌ల నంబర్లను ట్యాంపరింగ్ చేసి యధేచ్ఛగా తిరుగుతున్నా వాహనాలకు జరి మానాలు విధించలేకపోతున్నారు. రహదారుల ప క్కన వాహనాలను పార్కింగ్ చేసినప్పుడు మాత్రమే ప్రత్యేక వాహనంలో బైక్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. నంబర్లను ట్యాంపరింగ్ చేసి న వారిపై కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేట్‌లో ప్రత్యేక తరగతులు

- యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి
- డీఈఓలకు టీపీపీటీఏ బాధ్యుల వినతి

విద్యారణ్యపురి : విద్యార్థులు సరదాగా గడిపేందుకు రాష్ట్ర విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈనెల 21 నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులు ప్రకటించింది. అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈసెలవులు వర్తిస్తాయని సెలవుల్లో తరగతులు నిర్వహించవద్దని కూడా ఆదేశించింది. అయినప్పటికీ ట్రైసిటీలో అక్కడక్కడ పలు ప్రైవేటు పాఠశాలలు సోమవారం ప్రత్యేక తరగతులను నిర్వహించటం వెలుగు చూశాయి. పలు పాఠశాలల్లో 8, 9, 10వ వతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారని తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ (టీపీపీటీఏ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌లాల్ నాయక్ చౌహాన్ ఆరోపించారు. సోమవారం టీపీపీటీఏ బాధ్యులు సోమవారం ట్రైసిటీలో పలు ప్రైవేటు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతులను నిర్వహిస్తుండటం గమనించి సంబంధిత యాజమాన్యాలతోనూ దసరా సెలవుల్లో తరగతలను నిర్వహించవద్దని కోరామని తెలిపారు. సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని హనుమకొండ, వరంగల్ డీఈఓలు డి.వాసంతికి, బి.రంగయ్యానాయుడికి వేర్వేరుగా కలిసి చందర్‌లాల్‌నాయక్‌చౌహాన్ ఇతర బాధ్యులు విన్నవించి వినతిపత్రాలు సమర్పించారు. డీఈఓలను కలిసిన వారిలో టీపీపీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముకుందం, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిందం ప్రకాశ్, కార్యదర్శి ఆడెపు చంద్రమోహన్, బాధ్యులు మురళి, దీపక్ తదితరులు ఉన్నారు.



వరంగల్ డీఈఓ రంగయ్యనాయుడుకు వినతిపత్రం సమర్పిస్తున్న టీపీపీటీఏ బాధ్యులు

నాటిన మొక్కలను కాపాడుకోవాలి



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

ఖిలా వరంగల్ : పర్యావరణ పరిరక్షణ కోసం నాటిన ప్రతీ మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ రాష్ట్ర నేతలు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ వన్నాల వెంకటరమణ సూచించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సోమవార వరంగల్ 41వ డివిజన్ కరీమాబాద్ ఉర్సు ప్రతాప్‌నగర్‌లోని నాగమయ్య గుడి ప్రాంగణంలో సేవా పక్షం కో–కన్వీనర్ కర్నే రవీందర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మొక్కలు నాటి మాట్లాడుతూ మోదీ పాలనలోనే దే శం, రాష్ట్ర అభివృద్ధి చెందుతుందన్నారు. కా లుష్యం తగ్గి వృక్షాలతో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వారు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి , ఏకాంతం గౌడ్, బైరి నాగరాజు, అర్జున్ గౌడ్, బోరిగం నాగరాజు, కర్నే వాసుదేవ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

బీఓఐ ప్రాసెసింగ్ కార్యాలయం ప్రారంభం

రామన్నపేట : నగరంలోని గోపాలస్వామి సమీపంలో బ్యాంకు ఆఫ్ ఇండియా (బీఓఐ) ప్రాంతీయ రుణాల ప్రాసెసింగ్ కార్యాలయాన్ని సోమవారం బ్యాంకు తెలంగాణ జోనల్ మేనేజర్ ముఖేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాసెసింగ్ కార్యాలయం ద్వారా వ్యాపార, వ్యవసాయ, గృహ నిర్మాణ, వాహనాలు, విద్య తదితర రుణాలు త్వరితగతిన అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా తమ ఖాతాదారులకు, వినియోగదారులకు అందుబాటులో ఉండి సత్వర సేవలు అందించేందుకు ఈ బ్రాంచిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మినహా మిగతా తెలంగాణ జిల్లాలకు ఈ కార్యాలయం తన సేవలను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ సెక్రటరీ గాలేటి నాగేశ్వర్, బ్యాంకు చీఫ్ మేనేజర్లు మధుకర్ గౌడ్, దీపక్, ఎస్ఎస్ చౌహాన్, మేనేజర్లు గోపికృష్ణ, జీవన్, రాజేష్, ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ముఖేష్ కుమార్

దేవీ నవరాత్రోత్సవాలు ప్రారంభం

హనుమకొండ, వరంగల్, కాజీపేట, హసన్‌పర్తి ప్రాంతాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. దేవాలయాలు, ముఖ్యకూడళ్లలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ముందుగా అమ్మవారిని పురవీధుల మీదుగా తీసుకొచ్చి పండితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రతిష్ఠించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణం, మహా మంగళ హారతులు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించినట్లు తెలిపారు. అమ్మవార్లను వివిధ అలంకరణలో అ లంకరించారు. కొన్నిచోట్ల మహాన్నదానం కార్యక్రమం చేపట్టారు. హనుమకొండలోని పద్మాక్షి అమ్మవారి దేవాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



హన్మకొండ అర్బన్ : అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



కాజీపేట : పూజలు చేస్తున్న భక్తులు



మడికొండ : వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



రామన్నపేట : పూజలు చేస్తున్న ప్రధానార్చకులు సంగమేశ్వర జోషి



కాజీపేట అర్బన్ : పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



ఖిలావరంగల్ : బాలాత్రిపుర సుందరీ దేవీ అలంకరణలో..



వరంగల్ చౌరస్తా: జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న మీసాల ప్రకాశ్



హసన్‌పర్తి : సత్యసాయి కాలనీలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బ్రిడ్జిపై లారీ బ్రేక్ డౌన్

1.45 గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం

హసన్‌పర్తి: ఎల్లాపురం బ్రిడ్జిపై లారీ బ్రేక్ డౌన్ అయింది. వరంగల్ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న క్రమంలో బ్రిడ్జిపై ఎక్కుతుండగా సాంకేతిక లోపంతో లారీ ని లిచిపోయింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే స్తంభించాయి. సాయంత్రం 5 నుంచి 6.45 గంటల వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

దారి మళ్లింపు

కరీంనగర్ నుంచి హనుమకొండ వైపునకు వచ్చే వాహనాలు అన్నాసాగరం, జయగిరి మీదుగా మళ్లించారు. హనుమకొండ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్లే వాహనాలు కూడా మరో మార్గం నుంచి తమ గమ్యస్థానాలకు వెళ్లాయి.



ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్